

ప్రతి రైతుకు పథకాలందేలా కృషి



- ఉమ్మడి వరంగల్ రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం
- చైర్మన్ పదవితో బాధ్యత మరింత పెరిగింది
- డీసీసీబీ టర్నోవర్ రూ.870కోట్ల నుంచి రూ.1,931కోట్లకు తెచ్చా
- 78,432మంది రైతులకు రూ.529.44కోట్ల రుణమాఫీ
- పదవుల కోసం పార్టీలు మారే వ్యక్తిని కాదు
- భవిష్యత్తు రాజకీయాల గురించి ఇప్పుడే ఏం చెప్పలేను
- టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

'వరంగల్ డీసీసీబీ 107ఏళ్ల చరిత్రలో తొలిసారి రాష్ట్ర స్థాయి చైర్మన్ పదవి దక్కింది. నాకు వచ్చిన ఈ అవకాశంతో ఓరుగల్లు రైతుల అభివృద్ధికి కృషి చేస్తా. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతీ పథకం చేరేలా దృష్టి పెడతా. ఇప్పటికే కొత్తగా 12బ్యాంకులను తీసుకొచ్చా. మరో ఐదు కొత్త బ్యాంకుల కోసం ప్రతిపాదనలు పంపించా' అని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అన్నారు. భవిష్యత్తు రాజకీయాలపై ఇప్పుడే ఏం చెప్పలేనని, పదవుల కోసం తాను పార్టీ మారే వ్యక్తిని కాదని, టెస్కాబ్ చైర్మన్ పదవి వస్తుందని కూడా ఊహించలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రైతులకు మేలు జరుగుతోందంటున్న మార్నేని రవీందర్‌రావు గురువారం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో ప్రత్యేకంగా ముచ్చటించారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

7

డ్రైపోర్టుకు అనువుగా..



మహబూబాబాద్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి) : దశాబ్దకాలం నాటి కల.. ఉభయ తెలుగు రాష్ట్రాల విభజన చట్టంలో పొందుపరిచిన ఉక్కుఫ్యాక్టరీ ఇప్పట్లో సాకారమయ్యేలా లేదు. ఆ స్థానంలో ప్రత్యామ్నాయంగా డ్రైపోర్టు ఏర్పాటు చేసైనా మహబూబాబాద్ జిల్లాలో ఉపాధి అవకాశాలు పెంపొందించాలని నిరుద్యోగులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆ దిశగా ఉపాధి కల్పన కోసం గిరిజన ప్రాబల్య జిల్లావాసులు ఎదురుచూస్తున్నారు. తీర ప్రాంత తమిళనాడు ఆంధ్రప్రదేశ్‌లను కలిపే హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ఉన్న మహబూబాబాద్ జిల్లా లో డ్రైపోర్టు ఏర్పాటుకు ఎన్నో అవకాశాలు ఉన్నాయని పరిశీలకులు చెబుతున్నారు.

ఉత్తర-దక్షిణ రైలు మార్గాల నడుమ ఉన్న మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ ఇందుకు అనువైన ప్రదేశంగా తెరపైకి వస్తోంది. రాష్ట్ర విభజన తర్వాత డ్రైపోర్టు ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్రం కేంద్రాన్ని కోరింది. ఆ తర్వాత దశాబ్ద కాలపు బీఆర్ఎస్ పాలనకు బైబై చెప్పిన తెలంగాణ రాష్ట్రప్రజలు మార్పు కోరుతూ కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చారు. ఇకనైనా ఈ ప్రతిపాదనను ప్రస్తుత ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంటే బాగుంటుందని నిరుద్యోగులు ఆశపడుతున్నారు. ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యంలో డ్రైపోర్టు ఏర్పాటుకుఅవకాశాలు మెండుగా ఉన్నాయంటున్నారు. తెలంగాణ స్టేట్ ఐపాస్ కింద పెట్టుబడులను ప్రోత్సాహించడంలో భాగంగాఇతరరంగాల్లో కూడా పెట్టుబడులను ఆహ్వానిస్తున్న క్రమంలో డ్రైపోర్టు ప్రతిపాదన ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. హైదరాబాద్ ఇప్పటికే ఫార్మా ఉత్పత్తి కేంద్రంగా అవతరించి ఉన్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఉన్న ఓడరేవుల నుంచి నేరుగా ఎగుమతులు, దిగుమతులు పెంచడానికి డ్రైపోర్టు ఉపకరిస్తుందంటున్నారు.

విభజన చట్టంలో ఉక్కుతో పాటు..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చట్టంలో తెలంగాణలో ఉక్కు ఫ్యాక్టరీతో పాటు డ్రైపోర్టు మంజూరు చేస్తామని పూర్వ కేంద్ర యూపీఏ ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకు కావాల్సిన స్థలాన్ని రాష్ట్రప్రభుత్వమే సేకరించాల్సిదేనని స్పష్టం చేసింది. ఆ క్రమంలోనే మహబూబాబాద్ జిల్లాలో అపారంగా ఉన్న బయ్యారం, గూడూరు ఇనుప ఖనిజం గుట్టల ముడిసరుకు ద్వారా ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటుపై ఆశలు చిగురించాయి. దశాబ్దకాలంగా జిల్లా ప్రజలు ఎదురుచూస్తున్న బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ కోసం అనేక సర్వేలు కొనసాగాయి. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదించింది. ఒక దశ లో బయ్యారం ఇనుప ముడి ఖనిజం ఫ్యాక్టరీ ఏర్పాటుకు సరిపోకుంటే ఛత్తీస్‌గడ్‌లోని బైలాడిల్లా నుంచి ముడిసరుకు తెప్పించైనా ఫ్యాక్టరీ నడపవచ్చని రాష్ట్రం ప్రతిపాదించింది. ఆ తర్వాత వరుస ఎన్నికలు ఈ అంశం తాత్కాలికంగా మరుగునపడింది. అదే క్రమంలో రాష్ట్రంలో డ్రైపోర్టు ఏర్పాటుకు ప్రయత్నాలు జరిగాయి. రెండు దఫాలు అధికారంలో కొనసాగిన బీఆర్ఎస్ ఈ అంశాన్ని మరుగున పడేసింది. వాస్తవానికి 2015 సంవత్సరంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా కోదాడలో డ్రైపోర్టు ఏర్పాటు చేస్తామని అప్పటి రాష్ట్రమంత్రి హరీష్‌రావు సూచనప్రాయంగా ప్రకటించారు. అయితే డ్రైపోర్టు ఏర్పాటుకు కావాల్సిన భూముల రేట్లు కోదాడ ప్రాం తంలో ఆకాశాన్ని అంటుతుండడంతో ఆ ప్రయత్నాలు అప్పట్లోనే నిలిచిపోయాయి. ప్రస్తుతం నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామంటూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, మూడోసారి కేంద్రంలో అధికారం చేపట్టిన బీజేపీ ఇకనైనా యువత ఉద్యోగ ఉపాధి అవకాశాల వైపు దృష్టి సారించాలని జిల్లాప్రజలు కోరుతున్నారు.

- దీనితోనైనా ఉపాధి లభిస్తుందని ఆశ
- దశాబ్ద కాలంగా బయ్యారం ఉక్కు పెండింగే
- డోర్నకల్ మండలం మీదుగా 365 ఎన్‌హెచ్, గ్రీన్‌ఫీల్డ్ హైవే..
- భౌగోళికంగా ఎగుమతుల రేవుగా కోస్తా ప్రాంతాలు
- జిల్లాలోని నిరుద్యోగుల ఎదురుచూపులు



మహబూబాబాద్ పట్టణ వ్యూ

డ్రైపోర్టు అంటే..

సముద్ర మార్గం ద్వారా ఎగుమతి, దిగుమతులకు సంబంధించిన వస్తువులు ఓడరేవుకు చేరుకుని.. అక్కడ్నుంచి రోడ్డు, రైలుమార్గాల ద్వారా నిర్దేశిత నగరాలు, ప్రదేశాలకు తరలిస్తారు. వాటికి సంబంధించిన ఎగుమతి, దిగుమతి సుంకాలను కేంద్రప్రభుత్వం పరిధిలో ఉండే సెంట్రల్ ఎక్సైజ్అండ్‌కస్టమ్స్ డిపార్ట్‌మెంట్ చూస్తుంది. అలాంటి ప్రక్రియ డ్రైపోర్టులో కూడా ఉంటుంది. అయితే డ్రైపోర్టు మాత్రం భూభాగం పైనే ఏర్పాటు చేస్తారు. విదేశాలకు ఎగుమతు లు, దిగుమతులు ద్వారా వచ్చిన సరుకులను అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన గోదాంలలో నిల్వ చేస్తారు. ఆయా సరుకులు కస్టమ్స్ తనిఖీల అనంతరం రవాణాకు అనుమతులు తీసుకునే అవకాశాలుంటాయి. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్నట్టుగా డ్రైపోర్టు ఏర్పాటు చేయాల్సి వస్తే తెలంగాణ జిల్లాల సరిహద్దు ఉత్తర, దక్షిణ రైలు మార్గాల నడుమ ఉన్న డోర్నకల్ రైల్వేస్టేషనే కీలకంగా మారుతుందని చెబుతున్నారు. డోర్నకల్‌లో రైల్వేకు సంబంధించిన విశాలమైన భూములు ఉండడం, ఒకవేళ ఇవి కూడా సరిపోకపోతే ప్రభుత్వం సేకరించేందుకు అనువుగా డోర్నకల్ చుట్టూర భూములు తక్కువ ధరలకు ఉండడం లాంటివి పరిగణలోకి తీసుకుంటే డ్రైపోర్టుకు డోర్నకల్ అనువైన స్థలంగా విశ్లేషిస్తున్నారు.

భౌగోళికంగా రేవు పట్టణాలకు చేరువలో..

కోస్తా ప్రాంతాల్లోని ప్రధాన రేవుపట్టణాలైన విశాఖ పట్టణం, గంగవరం, కాకినాడ, మచిలీపట్నం, కృష్ణపట్నం తదితర కేంద్రాలకు తెలంగాణలోని మిగతా ప్రాంతాలకంటే భౌగోళికంగా డోర్నకలే అతి సమీపంలో ఉండడం విశేషం. రోడ్డు రవాణా కోణంలో చూస్తే 365 జాతీయరహదారి డోర్నకల్ మండలం మీదుగానే వెళ్తుంది. కొత్తగా ప్రతిపాదనలో ఉన్న అమరావతి, నాగ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ హైవే, గ్రీన్‌ఫీల్డ్ హైవేకూడా డోర్నకల్ ప్రాంతాన్ని అనుకుని వెళ్తున్నాయి. ఇప్పటికే 33 అడుగుల వెడల్పుతో నిర్మించిన రోడ్డు డోర్నకల్ పట్టణానికి మహబూబాబాద్‌కు అనుసంధానంలో ఉంది. డోర్నకల్ ద్వారా రోడ్డు మార్గంలో ఏన్కూరు, తల్లాడ, సత్తుపల్లి మీదుగా పశ్చిమగోదావరి జిల్లా దేవరపల్లి నుంచి ప్రయాణిస్తే కాకినాడ వస్తుంది. మరోపక్క తిరువూరు, నూజీవీడు, హనుమాన్ జంక్షన్ నుంచి మచిలీపట్నం పోర్టు

మిగతా 8వ పేజీలో..

యువతి ఆత్మహత్య కేసులో ఒకరికి పదేళ్ల జైలు

- తీర్పు వెల్లడించిన జిల్లా కోర్టు ప్రధాన జడ్జి

మహబూబాబాద్ రూరల్, జూన్ 20 : పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి, మోసగించడంతో యువతి ఆత్మహత్య చేసుకున్న కేసులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ గురువారం మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రధాన జడ్జి పసుపులేటి చంద్రశేఖర ప్రసాద్ తీర్పునిచ్చారు. కోర్టు హెడ్‌కానిస్టేబుల్ సంపత్‌రెడ్డి తెలిపిన ప్రకారం. మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు సిగ్నల్ కాలనీకి చెందిన మనుబోతుల శిరీషను అదే కాలనీకి చెందిన శ్యామల కార్తీక్ ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడు. దీంతో 2017 డిసెంబర్ 24న శిరీష గడ్డి నివారణ మందుతాగి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి మనుబోతుల యశోద ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐలు నర్సయ్య, రమేష్‌బాబు కేసు నమోదు చేశారు. ఈ కేసును విచారించి చార్జ్‌షీట్‌ను కోర్టులో దాఖలు చేశారు. జిల్లా ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ ఆదేశాలతో ప్రస్తుత డీఎస్పీ తిరుపతిరావు, టౌన్ సీఐ దేవేందర్ పర్యవేక్షణలో కోర్టు డ్యూటీ ఆఫీసర్ భూక్య రవీందర్ కోర్టులో 12 మంది సాక్షులను ప్రవేశపెట్టారు. జిల్లా కోర్టు ప్రధాన జడ్జి పసుపులేటి చంద్రశేఖర ప్రసాద్ ఎదుట పబ్లిక్ ప్రాసిక్యూటర్ సీహెచ్.వెంకటేశ్వర్లు వాదనలు వినిపించగా, పూర్వాపరాలు పరిశీలించిన అనంతరం నిందితుడైన శ్యామల కార్తీక్‌కు పదేళ్ల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన జడ్జి తీర్పును ఇచ్చారు. కేసును విచారించిన అప్పటి ఎస్‌ఐలు నర్సయ్య, రమేష్‌బాబు, ప్రస్తుత టౌన్ సీఐ దేవేందర్, పీపీ వెంకటేశ్వర్లు, కోర్టు డ్యూటీ ఆఫీసర్ రవీందర్‌ను ఎస్పీ అభినందించారు.

మరిపెడ బస్టాండ్‌ను ఆధునికీకరిస్తున్నాం

- ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్



మరిపెడ బస్టాండ్ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న రాంచంద్రునాయక్

మరిపెడ, జూన్ 20 : మండల కేంద్రంలోని బస్టాండ్‌ను నూతనంగా ఆధునీకరిస్తున్నామని ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. గురువారం మానుకోట డిపోకు చెందిన ఆర్టీసీ అధికారులతో కలిసి ఆయన మరిపెడ బస్టాండ్‌ను ఆకస్మికంగా సందర్శించారు. బస్టాండ్ ప్రాంగణాన్ని పరిశీలించారు. నూతనంగా నిర్మిస్తున్న బస్టాండ్ ప్లాట్‌ఫాం నిర్మాణ పనులపై ఆరా తీశారు. బస్టాండ్ వెనుక ప్రాంతాన్ని షాపింగ్ కాంప్లెక్స్‌గా మార్చి ఆవరణ మొత్తం కొత్త మెరుగులుదిద్దాలని సంబంధిత అధికారులకు సూచించారు. 1972లో ఏర్పాటు చేసిన మరిపెడ బస్టాండ్ గత కొంతకాలంగా పెద్దపెద్ద గుంతలతో ఉండి ప్రయాణికులకు ప్రాణసంకటంగా మారిందన్నారు. ఈ బస్టాండ్ ప్లాట్‌ఫాం నిర్మాణ పనులు జూన్‌లోపే పూర్తికావాల్సి ఉండగా, ఎన్నికల కోడ్‌తో కొంత ఆలస్యమైందన్నారు. ప్రయాణికుల సౌకర్యం కోసం ఎలాంటి ఇబ్బందులు లేకుం డా చూడాలని అధికారులను కోరారు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనుల నిర్వాహణ సాగాలని ఆర్టీసీ ఇంజినీర్లను ఆయన ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెండ్లీ రఘువీర్‌రెడ్డి, కార్యదర్శి గుగులోత్ రవినాయక్, ఐలిమల్లు ఉన్నారు.

ఉద్యాన తోటలకు రూ.1.58 కోట్ల రాయితీ విడుదల

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూన్20 : జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఆయిల్ పామ్ తోటల రాయితీలు రూ.1.58 కోట్లు ప్రభుత్వం నుంచి విడుదలైనట్లు జిల్లా ఉద్యానవన పట్టు పరిశ్రమ అధికారి జినుగు మరియన్న తెలిపారు. మహబూబాబాద్‌లో గురువారం ఆయన మాట్లాడారు. 925 మంది రైతులకు చెందిన 3,774 ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలకు సంబంధించిన రాయితీలను ప్రభుత్వం విడుదల చేసిందని చెప్పారు. ఆయిల్‌పామ్ రైతులకు అంతరపంటల సాగుకు, ఆయిల్‌పామ్ తోటల యాజమాన్యం కోసం రూ.2100 చొప్పున వెరసి ఎకరాకు ఏడాదికి రూ.4200 చొప్పున విడుదలయ్యాయి. రాయితీ నిధులను విడుదల చేసేందుకు కృషి చేసిన రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఉద్యానవన సంచాలకుడు అశోక్‌రెడ్డికు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

'పెంటావాలెంట్' వాక్సిన్ కొరత

- మూడు వారాలుగా సరఫరా బంద్
- జిల్లాలోని ఆరోగ్య కేంద్రాల్లో నిండుకున్న నిల్వలు
- ఇతర జిల్లాలకు వెళుతున్న తల్లిదండ్రులు



పెంటావాలెంట్ వాక్సిన్ అందుబాటులో లేని కేసముద్రం ఆరోగ్య ఉపకేంద్రం

కేసముద్రం, జూన్ 20 : ప్రభుత్వ ఆస్పత్రుల్లో శిశువులకు వేయాల్సిన పెంటావాలెంట్ టీకా అందుబాటులో లేకపోవడంతో తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. మహబూబాబాద్ జిల్లాలో 21 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 173 ఉపఆరోగ్య కేంద్రాలున్నాయి. జిల్లాలో ఆరేళ్లలోపు పిల్లలు 81 వేల మంది ఉండగా ఇందులో సుమారు 10 వేల మంది వరకు శిశువులు ఉన్నారు. ప్రతీ బుధవారం జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉపకేంద్రాల్లో వేయాల్సిన టీకాల్లో ముఖ్యమైన పెంటావాలెంట్ టీకా అందుబాటులో లేదు. శిశువుల్లో ఐదురకాల వ్యాధులైన డిప్తీరియా, పెర్టుసిస్, టెటానస్, హిబ్, హెపటైటిస్ బీ రాకుండా నివారించేందుకు అరికట్టేందుకు ఈ టీకాను ఉపయోగిస్తారు. ఈ టీకాలను 6, 10, 14 వారాల శిశువులకు మూడు దఫాలుగా వేయించాల్సి ఉంటుంది. ఇంతటి కీలకమైన టీకా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, ఆరోగ్య ఉపకేంద్రాల్లో అందుబాటులో లేకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో కేసముద్రంలో తమ పిల్లలకు టీకాలు వేయించేందుకు ఆరోగ్య ఉపకేంద్రానికి వెళ్లగా టీకా అందుబాటులో లేదని తెలిపారు. మూడు వారాలుగా జిల్లాలో ఈ టీకాల సరఫరా నిలిచిపోయింది. ఆస్పత్రుల్లో నిల్వఉన్న టీకాలను రెండు వారాలుగా వినియోగించారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా చాలా ఆస్పత్రుల్లో ఈ టీకా అందుబాటులో లేదని వైద్యవర్గాలు వెల్లడించాయి. ఇదిలా ఉండగా కొంతమంది పొరుగున వరంగల్ జిల్లా పరిధిలోని నెక్కొండ మండలం రెడ్లవాడ, అలంకానిపేట ప్రాథమిక ఆరోగ్యకేం ద్రాలకు వెళ్లి టీకాలు వేయిస్తున్నారు. పొరుగు జిల్లాలో అందుబాటులో ఉన్న టీకాలు ఇక్కడ ఎందుకు అందుబాటులోలేవని పలువురు తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఇక్కడి వైద్యాధికారులు నిర్లక్ష్యం కారణంగానే వాక్సిన్లు అందుబాటులో లేవని ఆరోపిస్తున్నారు. ఈ విషయం పై జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అంబరీషను వివరణ కోరగా జిల్లాలో పెంటావాలెంట్ వాక్సిన్ కొరత ఉందని, ఈ మేరకు చైల్డ్ హెల్త్ ఇమ్యునైజేషన్ జాయింట్ డైరెక్టర్‌కు లేఖ పంపి వెంటనే ఈ టీకాలను తెప్పించనున్నట్లు తెలిపారు.

ఉద్యోగం నుంచి సురేష్ తొలగింపు

- భవిష్యత్‌లో ఏ కొలువులోకి తీసుకోకుండా బ్లాక్‌లిస్టులో పేరు
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ట్రాన్స్‌పోర్టు కమిషనర్ బుద్ధ ప్రకాశ్‌జ్యోతి

మహబూబాబాద్ టౌన్, జూన్ 20 : మహబూబాబాద్ జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న డేటాబేస్ అసిస్టెంట్ ఈ.సురేష్‌ను ఉద్యోగంలో నుంచి తొలగించినట్లు రాష్ట్ర ట్రాన్స్‌పోర్టు కమిషనర్ బుద్ధ ప్రకాశ్‌జ్యోతి బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. మహబూబాబాద్ జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న డేటాబేస్ అసిస్టెంట్ సురేష్ గత మూడు రోజుల క్రితం తన టేబుల్‌పై మద్యం (బీరు) సీసా పక్కనే పెట్టుకుని విధులు నిర్వహిస్తున్న ఫొటో సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. ఈ కథనాన్ని వివిధ పత్రికలు, మాధ్యమాల్లో ప్రసారం కావడంతో రవాణా శాఖ ఉన్నతాధికారులు స్పందించారు. వెంటనే విచారణ జరిపి ఔట్ సోర్సింగ్ ఉద్యోగి సురేష్‌ను ఉద్యోగంలో నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అంతేకాకుండా అతన్ని భవిష్యత్‌లో ఇతర ఉద్యోగాల్లో తీసుకోకుండా బ్లాక్‌లిస్టులో పెట్టారు. కార్యాలయ ఆవరణలో మద్యం సేవించిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగి సురేష్, అతన్ని ప్రోత్సాహించిన ఆర్టీఏ ఏజెంట్లు మధు, సాధిక్‌పై మానుకోట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అదే విధంగా రవాణాశాఖ జిల్లా కార్యాలయంలో మూడు సంవత్సరాలు పూర్తి చేసిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎవరైనా ఉంటే ఇతర ప్రాంతాలకు పంపించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

షెడ్యూల్ తెగల అభివృద్ధికి అధికారులు కృషి చేయాలి

- సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా చూడాలి
- సమస్యలపై వచ్చిన బాధితుల నుంచి అర్జీలను స్వీకరించాలి
- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్



కలెక్టర్ కార్యాలయంలో మాట్లాడుతున్న జాటోత్ హుస్సేన్‌నాయక్

మహబూబాబాద్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి) : షెడ్యూల్ తెగల ఆరికాభివృద్ధికి అధికారులు కృషి చేయాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ సూచించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మూడు రోజులు పర్యటనలో భాగంగా తొలిరోజు గురువారం మానుకోట జిల్లాకు వచ్చారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అధ్యక్షతన అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. జిల్లాలో షెడ్యూల్ తెగల అభ్యున్నతికి ప్రణాళికలు రూపొందించాలని, వారి హక్కుల పరిరక్షణకు అధికారులు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం అములు చేసే సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా చూడాలన్నారు. ఈ కమిషన్‌కు ఏదైనా కేసును విచారించే విషయంలో సివిల్ కోర్టుకు ఉండే అధికారాలు ఉంటాయని, ఏ చిన్నసమస్య అయినా నిర్లక్ష్యం చేయవద్దన్నారు. అధికారులు తమ దృష్టికి వచ్చిన షెడ్యూల్ తెగలకు సంబంధించిన ప్రతీ సమస్యపై స్పందించి పరిష్కార మార్గాలను చూపాలని అన్నారు. ఎక్కడా షెడ్యూల్ తెగల హక్కుల ఉల్లంఘన జరగకుండా చూడాలని పోలీసుశాఖకు సూచించారు. అనంతరం జిల్లాలో వివిధ మండలాల నుంచి పలు సమస్యలపై వచ్చిన బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్‌కు సూచించారు. అనంతరం అటవీ శాఖ జిల్లా కార్యాలయంలో ఆ శాఖ అధికారులతో సమావేశమై పోడు భూముల సమస్యలపై చర్చించారు. జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించి అధికారులతో మాట్లాడారు.

పోస్టాఫీసును సందర్శించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా అదనపు కలెక్టర్ ఎండేవిడ్, అదనపు ఎస్పీ చెన్నయ్య, ఆర్డీవోలు అలివేలు, నర్సింహారావు, గిరిజనసంక్షేమ శాఖ డీడీ ఎర్రయ్య, జిల్లా వైద్యాధికారి కళావతిబాయి, అటవీశాఖ అధికారి విశాల్ బట్టుల, డీఎంఅండ్‌హెచ్‌వో కళావతి భాయి, ఆర్‌సీవో రాజ్యలక్ష్మి, జిల్లా ఉపవైద్యాధికారి అంబరీష, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, సూపరింటెండెంట్ పవన్ కుమార్ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి..

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 20: రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం జరుగనున్న నేపథ్యంలో ఆయన ముఖ్యమంత్రిని విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు గురువారం హనుమకొండలోని సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో భోగేశ్వర్ మాట్లాడారు. పాఠశాలల్లో స్కావేంజర్లను నియమించాలని, పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని, 317 బాధితులకు న్యాయం చేయాలన్నారు. పీఆర్సీ కమిటీని నియమించి పెండింగ్ నాలుగు బిల్లులను మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మనోజ్, స్వామి, వీరస్వామి, మల్లయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందుల్లో నర్సులు

ఎంజీఎంలో వేతనాలు రాక రెగ్యులర్ నర్సుల అవస్థలు

వరంగల్ మెడికల్, జూన్ 20: ఎంజీఎం ఆస్పత్రిలో కొన్ని నెలల కిందట రెగ్యులర్ ప్రాతిపదికన నియామకమైన 127 మంది నర్సింగ్ ఆఫీసర్లు ఆర్థిక కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఐదు నెలల కిందట రాష్ట్రవ్యాప్తంగా బోధన ఆస్పత్రుల్లో నర్సింగ్ ఆఫీసర్ల నియామకమయ్యారు. ఇందులో 127మంది నర్సింగ్ ఆఫీసర్లు రెగ్యులర్ పద్ధతిలో ఎంజీఎంకు కేటాయించబడ్డారు. అయితే వీరికి ఎంప్లాయ్ ఐడీ, సీపీఎస్ నెంబరు కోసం ఎంజీఎం నుంచి ఖజానా కార్యాలయానికి పంపించాల్సి ఉంది. కానీ కొందరి నిర్లక్ష్యం వల్ల ఇంతకాలంగా జీతాలు అవడం లేదని వాపోతున్నారు.

కేఎంసీలో వేతనాల రికవరీ

కాకతీయ మెడికల్ కళాశాల ఆవరణలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఆఫీసర్ల జీతాల్లో కోత విధిస్తామని అధికారులకు బెదిరింపులకు పాల్పడుతున్నట్లు సమాచారం. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో మూడు ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా 138 మంది 2021 జూన్ 13వ తేదీన నియామకం అయ్యారు. వీరికి ప్రతీ నెల రూ. 25,140 జీతంగా చెల్లించారు. ఆ తరువాత 2022వ సంవత్సరం నుంచి 30శాతం జీతం పెరిగిందని, ప్రతీ నెల రూ.32వేలు జీతం చెల్లించారు. అయితే ఇంతకాలం చెల్లించాక పెరిగిన జీతం మీకు వర్తించదని పేర్కొంటూ ప్రతీ ఒక్క కాంట్రాక్టు నర్సింగ్ ఆఫీసర్ రూ.84 వేలు చెల్లించాల్సిందేనని హుకుం జారీ చేశారు. ఇది కూడా ప్రతీ నెల జీతంలో రికవరీ చేస్తామని కేఎంసీ అధికారులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని కాంట్రాక్ట్ నర్సింగ్ అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కువ మాట్లాడితే ఉద్యోగాలు తీసేస్తామని బెదిరిస్తున్నారని వాపోతున్నారు. జిల్లా కలెక్టర్ తమకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రతీ రైతుకు పథకాలందేలా కృషి

● ఉమ్మడి వరంగల్ రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ● టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

[ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ]



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - వరంగల్)

తనకు వచ్చిన అవకాశంతో ఉమ్మడి జిల్లా రైతుల అభ్యున్నతి కోసం కృషి చేస్తానని, ప్రతీ ప్రభుత్వ పథకాన్ని రైతులకు చేర్చే విధంగా దృష్టి పెడతానని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు పేర్కొన్నారు. ఇటీవల టెస్కాబ్ చైర్మన్‌గా నియమితులైన ఆయన గురువారం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికిచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలు మాట్లాడారు. వరంగల్ డీసీసీబీ 107ఏళ్ల చరిత్రలో తొలిసారి రాష్ట్ర స్థాయి చైర్మన్ పదవి దక్కిందని, ఇప్పటికే కొత్తగా 12బ్యాంకులను తీసుకవచ్చానని, మరో ఐదు కొత్త బ్యాంకుల కోసం ప్రతిపాదనలు పంపించానని వివరించారు. పదవుల కోసం పాకులాడే తత్వం తనది కాదని, తనకు ఈ టెస్కాబ్ చైర్మన్ పదవి వస్తుందని కూడా ఊహించలేదన్నారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎంతో మేలు జరుగుతోందన్నారు.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి : టెస్కాబ్ చైర్మన్ పదవి రావటంపై మీ స్పందన?

మార్నేని రవీందర్‌రావు : వరంగల్ సహకార బ్యాంకుకు 107 ఏళ్ల చరిత్ర ఉంది. ఇప్పటి వరకు రాష్ట్రస్థాయిలో చైర్మన్ పదవి దక్కింది లేదు. సీఎం రేవంత్‌రెడ్డి, వరంగల్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేల సహకారంతో టెస్కాబ్ చైర్మన్ పదవి దక్కడం చాలా ఆనందంగా ఉంది. తొలిసారి వరంగల్‌కు వచ్చిన ఈ పదవితో ఓరుగల్లు రైతులకు సాధ్యమైనంత వరకు మేలు చేసేలా ప్రణాళిక రూపొందించుకుంటున్నా. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఐదు లక్షల మందికి పైగా రైతులు సభ్యులుగా ఉన్నారు. వీరిలో ప్రతీ ఒక్కరికి ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు డీసీసీబీల ద్వారా చేరేలా కృషి చేస్తా.

ఆంధ్రజ్యోతి: చైర్మన్ పదవి వస్తుందనే కాంగ్రెస్‌లోకి వెళ్లారా?

మార్నేని: అసలు టెస్కాబ్ చైర్మన్ పదవిపై ఎప్పుడూ ఆశ కూడా పడలేదు. పదవుల కోసం పార్టీ మారే వ్యక్తిని కాదు. సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్న విధానం నాకు నచ్చింది. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి, అమలుకు శ్రీకారం చుడుతున్న దమ్మున్న సీఎం రేవంత్‌రెడ్డి. ఆయన నాయకత్వంలో పని చేస్తే రైతులకు మేలు జరుగుతుందనే ఆశతో కాంగ్రెస్‌లో చేరా. నేను కాంగ్రెస్‌లో చేరిన తరువాతే టెస్కాబ్ చైర్మన్ స్థానం ఖాళీ అయింది. ఊహించని విధంగా నాకు చైర్మన్ పదవి దక్కింది. దీంతో ఈ పదవితో వరంగల్ రైతులకు సేవ చేయాలనే బాధ్యత మరింత పెరిగింది.

ఆంధ్రజ్యోతి: డీసీసీబీ చైర్మన్‌గా సాధించిన ప్రగతి ఏంటి?

మార్నేని: 2020లో డీసీసీబీ చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్నప్పుడు రూ.870కోట్ల టర్నోవర్ మాత్రమే ఉండేది. ఈ నాలుగేళ్ల కాలంలో రూ.1,930.70కోట్లకు బ్యాంకుల లావాదేవీలు పెంచాము. అంతేకాకుండా ఎంపీఏ రేటు 7.5శాతంగా ఉండేది. ప్రస్తుతం 2.99 శాతానికి చేర్చాం. చాలావరకు మొండి బకాయిలను వసూలు చేశాం. కొత్తగా 12 బ్యాంకులను ఏర్పాటు చేశాం. మరో 11బ్యాంకుల ఏర్పాటు కోసం ఆర్‌బీఐకి ప్రతిపాదనలు పంపాం. మొత్తం రూ.1,395.18కోట్ల రుణాలు ఇవ్వగా, ఇందులో వ్యవసాయ రుణాలు రూ.573.73కోట్లు కాగా, వ్యవసాయేతర రుణాలు రూ.822.50కోట్లు ఇచ్చాం. రూ.540.56కోట్ల డిపాజిట్లు సేకరించి రాష్ట్రంలోనే వరంగల్ డీసీసీబీని అగ్రగామిగా నిలబెట్టాం.

ఆంధ్రజ్యోతి: ఎంతమంది రైతులకు వ్యవసాయ, వ్యవసాయేతర రుణాలిచ్చారు?

మార్నేని: ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 70సహకార సంఘాలు ఉండగా, 78,432మంది సభ్యులున్నారు. 32డీసీసీబీ బ్యాంకుల బ్రాంచిలున్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు గత డిసెంబరు 9వ తేదీలోపు రూ.2లక్షల వరకు రుణం తీసుకున్న 78,432మంది రైతులకు రూ.529.44కోట్ల రుణమాఫీ చేయాల్సిందిగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. అలాగే వ్యవసాయేతరమైన దీర్ఘకాలిక (ఎల్‌టీ), గోల్డ్, ఎస్ఏవో, జేఎల్‌జీ, ఎడ్యుకేషన్, హౌసింగ్, వాహనాలు, వ్యక్తిగత తదితర 18రకాలకు పైగా రుణాలకు రూ. 1395.18కోట్లు డీసీసీబీ ద్వారా అందించటం జరిగింది. నాబార్డు సహకారంతో ఆత్మ నిర్భర్ అభియాన్ భారత్‌ను అమలు చేస్తున్నాం. దీని ద్వారా రూ.2కోట్ల వరకు రుణాన్ని ఏడేళ్లలో చెల్లించేలా కేవలం 8పైసల వడ్డీకే అందిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: కొత్తగా బ్యాంకులు ఎక్కడెక్కడ ఏర్పాటు చేశారు?

మార్నేని: ఉమ్మడి వరంగల్ జిల్లాలో నాలుగేళ్ల కాలంలో కొత్తగా 12బ్యాంకులను ఏర్పాటు చేశాం. పర్వతగిరి, పాలకుర్తి, కొడకండ్ల, కేసముద్రం, చిట్యాల, ఏటూరునాగారం, ధర్మసాగర్, ఐనవోలు, మొగిలిచర్ల, తరిగొప్పుల, ములుగు గణపురం, నల్లబెల్లి కేంద్రాల్లో కొత్త బ్రాంచిలను ప్రారంభించాం. అలాగే కురవి, మొగుళ్లపల్లి, దేవరుప్పుల, రఘునాథపల్లి, సంగెం, హసన్‌పర్తి, మంగపేట, గీసుకొండ, నర్సింహులపేట, బచ్చన్నపేట, నెల్లికుదురు తదితర 11ఏరియాల్లో నూతన బ్యాంకుల ఏర్పాటుకు ఆర్‌బీఐకి ప్రతిపాదనలు పంపాం.

ఆంధ్రజ్యోతి: మీ తదుపరి లక్ష్యం ఎమ్మెల్యే సీటుపైనేనా?

మార్నేని: భవిష్యత్ రాజకీయాలపై ఇప్పుడే ఏం చెప్పలేం. ఎమ్మెల్యేగా పోటీ చేయాలనే ఆలోచన అయితే లేదు. కానీ, మూడు దశాబ్దాలుగా ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో ఎలాంటి మచ్చ లేకుండా కొనసాగుతున్నా. పీఏసీఎస్ చైర్మన్‌గా, జడ్పీటీసీ, ఎంపీపీ, జడ్పీ ఫ్లోర్ లీడర్‌గా, డీసీసీబీ చైర్మన్‌గా, ప్రస్తుతం టెస్కాబ్ చైర్మన్‌గా పని చేస్తున్నాను. ఏ పదవిలో ఉన్నా ప్రజల సమస్యలను పరిష్కరించటం పైనే మొదటి ప్రాధాన్యం ఉంటుంది. ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో ఓరుగల్లు రైతులకు మేలు జరిగేలా ప్రత్యేకంగా దృష్టి పెట్టి పని చేస్తున్నా.

రూ.650 కోట్ల బల్దియా బడ్జెట్‌కు ఆమోదం

సమష్టి కృషితో నగరాన్ని అభివృద్ధి చేస్తాం : మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, జూన్ 20: వరంగల్ నగర పాలక సంస్థ 2024-25 సంవత్సరానికి ముసాయిదా బడ్జెట్ అంచనాల మేరకు మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన పాలక మండలి ఆమోదించింది. ఈ సమావేశంలో 1/3 కోరం సభ్యులు హాజరైన తర్వాత బల్దియా అకౌంట్స్ పర్యవేక్షణాధికారి సరిత బడ్జెట్ అంచనాలను వెల్లడించారు. రూ.650.12కోట్ల అంచనాలతో రూపొందించిన బడ్జెట్‌కు మెజారిటీ సభ్యులు చేతులెత్తి అంగీకారం తెలుపడంతో పాలకవర్గం బడ్జెట్‌ను అమోదించింది. ఇందులో రూ.237.02 కోట్లు సాధారణపన్నుల ద్వారా, రూ.410.10 కోట్లు వివిధ గ్రాంట్ల ద్వారా ఆదాయం సమకూరుతుందని అవచనా వేశారు.

ఈ సందర్భంగా మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మునిపిపల్ పట్టణ అభివృద్ధి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్ల సహకారంతో గ్రేటర్ వరంగల్‌ను అభివృద్ధి చేసేందుకు నిరంతరం శ్రమిస్తున్నామన్నారు. తాను మేయర్‌గా కొలువుదీరిన తర్వాత 2024-25 బడ్జెట్‌ను కలుపుకుని మూడోసారి బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించామన్నారు. ఈయేడు బడ్జెట్‌లో ప్రజలపై ఎక్కువ పన్నుల భారం మోపకుండా బడ్జెట్‌ను రూపొందించినట్లు తెలిపారు. ఈ బడ్జెట్ గ్రేటర్ 66 డివిజన్‌ల అభివృద్ధికి ఎంతగానో దోహదం చేస్తుందని అన్నారు. ప్రధానంగా విలీనగ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తామన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పోచంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, నగర పాలక సంస్థ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే, డిప్యూటీ మేయర్‌తో పాటు వివిధ పార్టీల కార్పొరేటర్లు, ఎక్స్ ఎఫీషియో సభ్యులు పాల్గొన్నారు.

బల్దియా ఆదాయం

ట్యాక్స్ రెవెన్యూ	రూ.8,98కోట్లు
అసైన్డ్ రెవెన్యూ కంపన్‌సేషన్	-------------
మున్సిపల్ ఆస్తుల అద్దెలు	రూ.12,66కోట్లు
టౌన్ ప్లానింగ్	రూ. 86,04కోట్లు
శానిటేషన్	రూ.18,97కోట్లు
ఇంజనీరింగ్	రూ.29,55కోట్లు
మొత్తం	రూ. 237,02కోట్లు

ఖర్చులు

సిబ్బందికి జీత భత్యాలు	రూ.80కోట్లు
పారిశుద్ధ్య నిర్వాహణకు	రూ.25,80కోట్లు
విద్యుత్ చెల్లింపులు	రూ.18,45కోట్లు
గ్రీన్ బడ్జెట్ 10 శాతం	రూ. 23,70కోట్లు
ఇంజనీరింగ్ విభాగానికి	రూ. 25,75కోట్లు
సాదారణ నిర్వాహణకు	రూ. 18,50కోట్లు
టౌన్ ప్లానింగ్	రూ. 1.20కోట్లు
డీఆర్ఎఫ్	రూ. 1.50కోట్లు
విలీన గ్రామాల అభివృద్ధికి	రూ. 14,04కోట్లు
ప్రజాసౌకర్యాల కల్పన	రూ. 5,20కోట్లు
వార్డుల అత్యవసర అభివృద్ధికి	రూ. 22,88కోట్లు

అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి 20 ఏళ్ల జైలు

వరంగల్ లీగల్, జూన్ 20: పదేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో నిందితుడికి 20 యేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.3వేల జరిమానా విధిస్తూ హనుమకొండ జిల్లా ఫోక్సో ప్రత్యేక కోర్టు కం మొదటి అదనపు సెషన్స్ జడ్జి బి.అపర్ణాదేవి గురువారం తీర్పు చెప్పారు. అదేవిధంగా బాధిత బాలికకు రూ.లక్ష నష్టపరిహారం చెల్లించాల్సిందిగా ప్రభుత్వాన్ని ఆదేశించారు. కేసు వివరాలు ఈ విధంగా ఉన్నాయి. హనుమకొండ కమలాపూర్ మండలం గునిపర్తి గ్రామానికి చెందిన ముత్యాల హన్మంతు 2017 సెప్టెంబరు 13న మధ్యాహ్నం 2 గంటలకు దివ్యాంగుల పాఠశాలలో చదువుతున్న ఓ బాలిక ఆడుకుంటుండగా ఇంట్లోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. దీంతో బాలిక అస్వస్థతతకు గురికావడంతో తల్లి విషయం తెలుసుకున్నది. హన్మంతు బాలికపై అత్యాచారానికి పాల్పడినట్లు నిర్ధారణ కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడు హన్మంతుపై ఫోక్సో కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువైనందున నిందితుడికి 20 ఏళ్ల కారాగార శిక్ష, రూ.3వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ ఎం.హరీష్ విక్రమ్ సాక్షులను ప్రవేశపెట్టగా దర్యాప్తు అధికారులుగా సీఐలు సతీష్‌చందర్‌రావు, ఇ.హరికృష్ణ వ్యవహరించారు. కోర్టు లైజన్ అధికారిగా కె.పరమేశ్వరి, భరోసా లీగల్ అధికారి సీహెచ్. నీరజ కేసులో సహకరించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజమల్లారెడ్డి కేసు వాదించారు.

బాలికను బెదిరించిన కేసులో వ్యక్తికి రెండేళ్ల జైలు

వరంగల్ లీగల్, జూన్ 20: ప్రేమించమని, లేదంటే చంపుతానని బాలికను బెదిరించిన కేసులో మారెపెల్లి అనురుధ్‌కు రెండేళ్ల కారాగార శిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ హనుమకొండ జిల్లా ఫోక్సో ప్రత్యేక కోర్టు కం మొదటి అదనపు సెషన్స్ జడ్జి బి.అపర్ణాదేవి గురువారం తీర్పు చెప్పారు. అదే విధంగా బాధిత బాలికకు రూ.50వేల నష్టపరిహారం చెల్లించాల్సిందిగా ప్రభుత్వాన్ని ఆదేశించారు. కేసు వివరాలు ఈ విధంగా ఉన్నాయి. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన మారెపెల్లి అనురుధ్ 14 యేళ్ల బాలికను 2019 ఆగస్టు 9న ఉదయం 10.30 గంటలకు తన ఇంటి వెనకాల రాగానే అకస్మాత్తుగా బాలిక వద్దకు వచ్చి నోరు మూశాడు. తనను ప్రేమించాలని, లేదంటే బాలికను, ఆమె కుటుంబ సభ్యులను చంపుతానని బెదిరించాడు. దీంతో బాలిక విషయం తల్లిదండ్రులకు తెలపడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు.

కేసు విచారణంలో నేరం రుజువైనందున నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. అదే విధంగా అంతకుముందు 2019 జనవరి 17న సాయంత్రం 6 గంటలకు బాలిక ఇంటి ముందుకు వచ్చి తనను ప్రేమించాలని, లేదంటే చంపుతానని బెదిరించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులోకూడా రెండేళ్ల జైలు శిక్ష, రూ.4వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. అదే విధంగా రూ.50వేలు నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. కాగా, ఈ రెండు కేసుల్లో విధించిన శిక్ష ఏకకాలంలో అనుభవించాల్సిందిగా న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు. కోర్టు పీసీ ఎ.రవి, సాక్షులను ప్రవేశపెట్టగా దర్యాప్తు అధికారిగా ఎస్సై జి.రాజ్‌కుమార్ వ్యవహరించారు. కోర్టు లైజన్ అధికారిగా కె.పరమేశ్వరి, భరోసా లీగల్ అధికారి సీహెచ్. నీరజ కేసులో సహకరించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజమల్లారెడ్డి కేసు వాదించారు.

బదిలీల ప్రక్రియకు కసరత్తు ప్రారంభం



బదిలీల ప్రక్రియ కసరత్తు చేస్తున్న డీఈవో అబ్దుల్‌హై

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 20: ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియలో భాగంగా బదిలీలకు రెండు జిల్లాల విద్యాశాఖలు రంగం సిద్ధం చేస్తున్నాయి. గురువారం రెండు డీఈవో కార్యాలయాల్లో డీఈవోలు సంబంధిత సిబ్బందిని బదిలీల పక్రియను వేగవంతం చేయాలని, ఖాళీలను గుర్తించి జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎస్జీటీ, తత్సమాన అర్హత కలిగిన ఉపాధ్యాయులను బదిలీ చేసేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. వరంగల్ జిల్లాలో సుమారుగా 556 మంది ఉపాధ్యాయులు బదిలీ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. ఇక హనుమకొండ జిల్లాలో 452 మంది ఉపాధ్యాయులు బదిలీలు అయ్యే అవకాశం ఉంది.

స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులకు దరఖాస్తుల ఆహ్వానం

కేయూ క్యాంపస్, జూన్ 20: కాకతీయ యూనివర్సిటీ ఇంగ్లీష్ విభాగం సెంటర్ ఫర్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్ (సెల్ట్) నేతృత్వంలో 40 రోజుల పాటు నిర్వహించే స్పోకెన్ ఇంగ్లీష్ అండ్ కమ్యూనికేషన్ స్కిల్స్ తరగతులకు దరఖాస్తులు చేసుకోవాలని డైరెక్టర్ డాక్టర్ ఆర్.మేఘనరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 10 నుంచి క్లాస్‌లు నిర్వహిస్తామని, జూలై 9 వరకు వర్సిటీ విద్యార్థులు ఉద్యోగులు రూ.వెయ్యి, ఇతరులు రూ.15 వందల చొప్పున క్యాంపస్ ప్రిన్సిపాల్ కార్యాలయంలో చెల్లించుకుని దరఖాస్తులు చేసుకోవాలని ఆమె కోరారు.

రేపు కేయూలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సమావేశం

కేయూ క్యాంపస్, జూన్ 20: ఈనెల 22న శనివారం ఉదయం 10.30 గంటలకు కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ సమావేశం సెనెట్‌హాల్‌లో ఏర్పాటు చేసినట్లు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 అల్మానాక్, కళాశాలల అనుబంధాలు, పరీక్షల షెడ్యూల్, స్పోర్ట్స్, గేమ్స్, ఎన్ఎస్ఎస్‌తో పాటు ఇతర అంశాలపై చర్చిస్తామని వెల్లడించారు. సంబంధిత డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ విధిగా హాజరుకావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

దూరవిద్య డిగ్రీ పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్

కేయూ క్యాంపస్, జూన్ 20: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న బీఏ, బీకాం, బీఎస్సీ ఇతర దూరవిద్య డిగ్రీ కోర్సుల పరీక్షల్లో ఒకరికి బదులుగా మరొకరు పరీక్ష రాస్తుండగా పరీక్షల తనిఖీ అధికారులు పట్టుకుని డీబార్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్. నరేందర్‌లు మంగళవారం తెలిపారు. డీబారైన వారిలో నల్లగొండ ప్రభుత్వ ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో ఒక్కరు ఉన్నట్లు పేర్కొన్నారు. వారిపై పోలీసు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే పరీక్షల నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

మహిళలకు ఆర్టీసీ శుభవార్త

డీలక్స్ బస్సులో ప్రయాణిస్తే డ్రాలో బహుమతులు

బాలసముద్రం, జూన్ 20: ఆర్టీసీ డిలక్స్ బస్సులో ఉప్పల్ క్రాస్‌రోడ్-హైదరాబాద్ రూట్లలో ప్రయాణించే మహిళ ప్రయాణికులు టికెట్ పై డ్రా తీసి బహుమతులు ఇవ్వనున్నట్లు హనుమకొండ డిపో మేనేజర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టికెట్ వెనుక తమ పేరు, ఫోన్ నెంబరు రాసి డ్రైవర్ పక్కన ఉండే లక్కీ డ్రా బాక్స్‌లో వేయాలని తెలిపారు. నెలలో రెండు సార్లు డ్రా తీసి ముగ్గురు మహిళలకు బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. మహిళలు డిలక్స్ బస్సుల్లో ప్రయాణించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రకటనలో తెలిపారు.

‘నులిపురుగుల నివారణతో రక్తహీనతకు చెక్’

నెహ్రూసెంటర్, జూన్20 : ఏడాది నుంచి 19 ఏళ్లలోపు అల్బెండజోల్ మాత్రలు అందించాలని, నులిపురుగుల నివారణతో రక్తహీనతకు చెక్ పెట్టొచ్చని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి బి.కళావతిబాయి సూచించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరిం చుకుని గురువారం జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని చిన్నారుల్లో నులిపురుగులను నివారించేందుకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్నామన్నారు. జిల్లాలో 1,74,240 మంది పిల్లలకు అల్బెండజోల్ మాత్రలను అందించినట్లు చెప్పారు. మిగిలిన పిల్లలకు 27వ తేదీన అల్బెండజోల్ మాత్రలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు, జిల్లా సంక్షేమ అధికారిణి వరలక్ష్మి, అధికారులు కృష్ణార్జున్‌రావు, మంగమ్మ, కేవీ రాజు, పురుషోత్తం, శ్రీనివాస్, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, అరుణ, రాజేందర్,రేణుక, పద్మ పాల్గొన్నారు.

వివిధ మండలాల్లో..

మహబూబాబాద్ మునిసిపల్ 24వ వార్డు పరిధిలోని ఇందిరానగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పిల్లలకు నులి పురుగుల నివారణ మాత్రలు అందించారు. ఈ సందర్భంగా హాజరైన మునిసిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న మాట్లాడుతూ 19 ఏళ్ల లోపు పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు వేయించాలని చెప్పారు. డాక్టర్ నర్మద, ఏఎన్‌ఎం దీనదయామతి, హెచ్ఎం. రమేష్, మోహన్, మార్నేని కిరణ్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్ రమాదేవి, కళ, ఉపేంద్ర పాల్గొన్నారు.



మానుకోటలో విద్యార్థినికి అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో కళావతిబాయి



మరిపెడ ఎస్సీ బాలికల గురుకులంలో విద్యార్థినులకు అల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

- 26వ వార్డు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో నులి పురుగుల నివారణ మాత్రలు వేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ డౌలగర్ స్వాతి శంకర్, డాక్టర్ శివ, ఏఎన్ఎం దీనదయామతి, అంగన్‌వాడీ టీచర్ చేపూరి సరి త, ఆర్పీ సరిత, ఆశాలు శారద, రేణుక, భద్రమ్మ పాల్గొన్నారు.
- జమాండ్లపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. తొలుత విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. హెచ్ఎం. గుగులోతు కిషన్‌నాయక్, కంబాలపల్లి పీహెచ్‌సీ వైద్యులు కుమార్, పార్మసిస్ట్ లక్ష్మి, బి.చందన, ఉపాధ్యాయులు ప్రభావతిదేవి, సీహెచ్.మహేశ్వర్, సరిత, మంజుల, ఆర్పీ అనిత, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.
- చిన్నగూడూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నులి పురుగుల నివారణ మాత్రలను విద్యార్థులకు అందజేశారు.
- మరిపెడ ఎస్సీ బాలికల గురుకులంలో నులి పురుగుల నివారణ మందులను ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ అందజేసి ప్రారంభించారు. ప్రభుత్వం ప్రజా ఆరోగ్యం కోసం కృషి చేస్తుందని చెప్పారు. రక్తహీనత నుంచి విద్యార్థుల రక్షణకు ప్రతి ఒక్కరు అల్బెండాజోల్ మాత్రలు వేసుకోవాలని సూచించారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో మురళీధర్, సీడీపీవో శిరీష, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవి, తహసీల్దార్ సైదులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీర్‌రెడ్డి, గుగులోతు రవినాయక్, ఐలుమల్లు పాల్గొన్నారు.
- దంతాలపల్లి మండలకేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో చిన్నారులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి చైతన్య, హెచ్ఎం వేణుమాధవ్, సీహెచ్‌వో బాలాజీ పాల్గొన్నారు.
- పెద్దవంగర మండలంలోని అన్నిప్రభుత్వ పాఠశాలల్లో నులిపురుగుల నివారణ మాత్రలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎర్ర సబిత, జడ్పీటీసీ శ్రీరాం జ్యోతిర్మయిసుధీర్, ఎంఎస్పీ మహేందర్, హెచ్ఎం కళాధర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.
- గార్ల మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు అందించారు. డాక్టర్ రాజ్‌కుమార్‌జాదవ్, సిబ్బంది ఇస్మాయిల్, పద్మ, జ్యోత్స్న, పార్వతి, సదాలి పాల్గొన్నారు.
- బయ్యారం మండలంలోని పాఠశాలల్లో విద్యార్థులకు, గంధంపల్లి, బయ్యారం పీహెచ్‌సీ కేంద్రాల్లో చిన్నారులకు నులిపురుగుల నివారణ మాత్రలను అందజేశారు.
- గూడూరు శివారు చంద్రుగూడెం గిరిజన బాలికల ఉన్నత పాఠశాల, కళాశాలలు, పీహెచ్‌సీల్లో, చిన్నారులకు, విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వీరస్వామి, ఎంపీటీసీ కత్తిస్వామి, వైద్యాధికారి ఎం.యమున, లవ్వారం, కోమల, లోక్యానాయక్, గణేష్, రజిత పాల్గొన్నారు.
- కురవిలో అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో నులి పురుగుల నివారణ మాత్రలు వేశారు. కార్యక్రమంలో జిల్లా అధికారి నాగేశ్వరావు, డాక్టర్ విరాజిత, డాక్టర్ సుధీర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానితులపై విచారణ

మరిపెడ, జూన్ 20 : నకిలీ విత్తనాలను అమాయక రైతులకు అంటగడుతున్నారనే సమాచారం మేరకు గురువారం మరిపెడ మునిసిపల్ పరిధిలోని దేశ్యాతండా దగ్గర అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఆంధ్రప్రదేశ్ ప్రాంతం నుంచి ప్రభుత్వ అనుమతిలేని పత్తి విత్తనాలను తెచ్చి ఇక్కడి రైతులకు విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు సంబంధిత వ్యక్తులకు చెందిన ఓ కారును, వారిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. దీనిపై ఎస్సై సంతోష్‌ను వివరణగా కోరగా.. అనుమానితులను పిలిచి విచారిస్తున్నామని చెప్పారు. ఎవ్వరినీ అదుపులోకి తీసుకోలేదన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

తొర్రూరు, జూన్ 20 : తొర్రూరు ఆర్టీసీ డిపో పరిధిలోని వివిధ రూట్లలో బస్సులు తిరుగుతున్న నేపథ్యంలో ఆయా గ్రామాల ప్రజలు తమ సమస్యలు, సలహాల కోసం డయల్ యువర్ డీఎంను సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ డిపో మేనేజర్ పద్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు తమ సలహాలు, సూచనల కోసం ఫోన్ : 99592 26053 నంబర్‌కు కాల్ చేసి తెలపాలన్నారు.

మహిళా ప్రయాణికులకు శుభవార్త

తొర్రూరు డిపో నుంచి ఉప్పల్, జగద్గిరిగుట్టకు రోజూ 35 బస్సులను నడుపుతారన్నారు. ఆ రూట్‌లలో మహిళా ప్రయాణీకులు చార్జీలు చెల్లించి డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే వారికి గిఫ్ట్‌ప్యాక్ అందిస్తామని మేనేజర్ పద్మ వెల్లడించారు. టికెట్ వెనక పేరు, అడ్రస్, మొబైల్ నంబర్‌రాసి గిఫ్ట్ బాక్స్‌లో వేయాలన్నారు. ప్రతీ 15 రోజులకు ఒకసారి డ్రా తీసి బహుమతులు అందిస్తామన్నారు. ఆర్టీసీ బస్సుల్లోనే సురక్షిత ప్రయాణం ఉంటుందని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రేపు మునిసిపల్ కౌన్సిల్ సమావేశం

మహబూబాబాద్ టౌన్, జూన్ 20 : మానుకోట మునిసిపల్ కార్యాలయంలో ఈనెల 22న ఉదయం 10.30 గంటలకు పాలకమండలి సాధారణ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గౌరవ సభ్యులు సకాలంలో హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మహబూబాబాద్ రూరల్, జూన్ 20 : జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం స్థానికులు గుర్తించారు. ఈవిషయాన్ని మునిసిపల్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి ఆ మృతదేహాన్ని జిల్లా మార్చురీకి తరలించారు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతి చెందిన వ్యక్తి యాచకుడై ఉంటాడని పోలీసులు, స్థానికులు అనుమానిస్తున్నారు.

‘మద్యం బ్రాండ్‌లు అందుబాటులో ఉంచాలి’

గూడూరు, జూన్ 20 : గూడూరు మద్యం షాపుల్లో వివిధ రకాల బ్రాండ్‌లను అందుబాటులో ఉంచాలని మద్యం ప్రియులు బుధవారం రాత్రి ఆందోళన చేపట్టారు. బెల్టుషాపుల్లో వివిధ రకాల బ్రాండ్‌ల మద్యం అందుబాటులో ఉంటుంది కానీ వైన్స్‌షాపుల్లో ఎందుకు ఉండడం లేదని ప్రశ్నించారు. తక్షణమే మద్యం షాపుల్లో బీర్లతోపాటు వివిధ రకాల బ్రాండ్‌లను అందుబాటు ఉంచాలని డిమాండ్ చేశారు.

సీఈవో ఉద్యోగానికి దరఖాస్తుల స్వీకరణ

చిన్నగూడూరు, జూన్ 20 : దాశరథి మహిళా రైతు ఉత్పత్తిదారుల సంస్థ తాత్కాలిక సీఈవో ఉద్యోగానికి అర్హుల నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్నట్లు సంస్థ చైర్‌పర్సన్ కొప్పుల కళావతి, వైస్ చైర్‌పర్సన్ విజయ తెలిపారు. ఈ ఉద్యోగానికి అగ్రికల్చర్ డిగ్రీ, అగ్రికల్చర్ మార్కెటింగ్, అగ్రికల్చర్ బిజినెస్, అగ్రికల్చర్ డిప్లొమా, తత్సమాన అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 26వ తేదీ వరకు చిన్నగూడూరు, మరిపెడ, డోర్నకల్ మండల సమాఖ్య కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అవని రైతు నేస్తం..

తొర్రూరు : అవని రైతు నేస్తం మహిళా ఉత్పత్తి దారుల కంపెనీ లిమిటెడ్‌కు తొర్రూరు, పెద్దవంగర మండలాల పరిధిలోని అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఆ సంస్థ చైర్‌పర్సన్ కేతిరెడ్డి లక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ రంగానికి సంబంధించి డిగ్రీ పూర్తి చేసిన గ్రామీణ ప్రాంతానికి చెందిన యువతీ యువకులతో పాటు మహిళా సంఘాల కుటుంబ సభ్యులైన వారికి మొదటి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఈనెల 25వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు తొర్రూరు డివిజన్ కేంద్రంలోని మదర్ థెరిస్సా మండల సమాఖ్య కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని తెలిపారు.

‘గిరిజన రైతుల భూములకు రక్షణ కల్పించాలి’



హుస్సేన్‌నాయక్‌కు వినతి పత్రం అందిస్తున్న ఎల్‌హెచ్‌పీఎస్ నేతలు, బాబునాయక్ తండా గిరిజన రైతులు

మహబూబాబాద్ టౌన్, జూన్ 21 : జిల్లాలో గిరిజన రైతుల భూములకు రక్షణ కల్పించాలని లంబాడ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) జిల్లా అధ్యక్షుడు బోడ రమేష్‌నాయక్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాతీయ ఎస్టీకమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్‌కు ఎల్‌హెచ్‌పీఎస్ నేతలు, బాబునాయక్ తండా గిరిజన రైతులు గురువారం వినతిపత్రాన్ని అందించారు. వారు తమ గోడును విన్పించారు. ఈ సందర్భంగా రమేష్‌నాయక్ మాట్లాడుతూ మెడికల్ కళాశాల నిర్మాణంలో భూములు కోల్పోయిన గిరిజన రైతులను ఆదుకోవాలని కోరారు. జిల్లాలో గిరిజనుల భూములను కబ్జా చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన రైతులు బానోత్ అనసూర్య రాధ, పద్మ, మంగ, భూక్య శ్రీను పాల్గొన్నారు.

- గిరిజన ఉపాధ్యాయులకు పదోన్నతుల్లో అన్యాయం జరిగిందని వారికి న్యాయం చేయాలని తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం (టీజీయూఎస్) సంఘం జిల్లా నాయకులు బానోత్ లచ్చిరాం, మాలోతు బాల్యానాయక్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు హుస్సేన్‌నాయక్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో బానోత్ శంకర్, రతన్‌సింగ్, తెలంగాణ ట్రైబల్ టీచర్స్ ఫెడరేషన్ (టీఎస్‌టీటీఎఫ్) నాయకులు భద్రునాయక్, భూక్య రాజేష్, దర్మానాయక్, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.
- దంతాలపల్లి : మండల కేంద్రంలో జాటోతు హుసేన్‌నాయక్ పర్యటించారు. ఈ సందర్భంగా బొడ్లాడ క్రాసురోడ్డు శివారులో గతంలో తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో గిరిజనుల నుంచి లాక్కున్న భూములు, ఇళ్ల స్థలాలను పరిశీలించారు. గిరిజనులకు జరిగిన అన్యాయంపై ఉన్నతాధికారులతో మాట్లాడుతానన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్‌గౌడ్, మండల అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు అల్లం సాయికుమార్ పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

- 8 మందిపై కేసులు నమోదు

నెహ్రూసెంటర్, జూన్ 20 : జిల్లాలో గుడుంబా నిర్మూలనే లక్ష్యంగా గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహిస్తున్న మహబూబాబాద్ ఎక్సైజ్ సీఐ చిరంజీవి తెలిపారు. గురువారం మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో సీరోల్, డోర్నకల్, గార్ల, మహబూబాబాద్ ప్రాంతాల్లో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించి, 8 మందిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. 44లీటర్ల నాటుసారా, 700 కిలోల బెల్లం, 80 కిలోల పట్టిక, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని 2,100 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశామన్నారు. అనంతరం ఎక్సైజ్ స్టేషన్‌లో నిర్వహించిన వాహనాల వేలానికి రూ.22,84,060 ఆదాయం సమకూరిందన్నారు. మిగిలిన వాహనాలకు ఈ నెల 26న వేలం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ సీఐ నీరజ, వరంగల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ నాగయ్య, తిరుపతి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

డ్రైపోర్టుకు అనువుగా..

(5వ పేజీ తరువాయి)

వస్తుంది. చెన్నై, కోల్‌కత్తా జాతీయ రహదారి ద్వారా విశాఖపట్టణం, గంగవరం, కృష్ణపట్నం రేవులకు తెలంగాణ రాష్ట్రం నుంచి ఎగుమతులు చేసే అవకాశాలు ఉంటాయి.

వివిధ దేశాలకు ఎగుమతులు ఇలా..

తెలంగాణ రాష్ట్రం నుంచి ఇప్పటికే గ్రానైట్, పాలిషింగ్ గ్రానైట్, చైనా, జపాన్ దేశాలకు ఎగుమతవుతోంది. ఇంకా బియ్యం, మొక్కజొన్న, మిర్చి, పసుపు, పత్తి తదితర వ్యవసాయ ఉత్పత్తులు, ఇండోనేషియా, థాయిలాండ్, వియత్నాం, తూర్పు ఆఫ్రికా దేశాలకు ఎగుమతి చేసుకోవచ్చు. హైదరాబాద్‌లో తయారయ్యే భారీ యంత్ర పరికరాలు కూడా ఎగుమతులు చేసే అవకాశాలు లభిస్తాయి. డ్రైపోర్టుల ద్వారా నిత్యం వివిధ సరుకుల ఎగుమతులు, దిగుమతులు కొనసాగించే కేంద్రానికి అనుసంధానంగా రవాణా కార్యాలయాలు, షిప్టుల వారీగా 24 గంటలు పనిచేసే ఉద్యోగులు, కార్మికులు, వారి కుటుంబాలు ఇలా అన్నిరంగాలకు సంబంధించి తెలంగాణలోని మహబూబాబాద్ జిల్లాలో ఉపాధి పొందడానికి అవకాశాలు కలుగుతాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా 5 వేల మందికిపైగా ఉపాధి లభిస్తుంది. ఇప్పటికి దశాబ్దాల కాలానికిపైగా బయ్యారం ఉక్కు ఏర్పాటు పెండింగ్‌లోనే ఉంది. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా.. కేంద్రంలో మళ్లీ ఎన్డీయే (బీజేపీ) అధికారంలో ఉన్న దరిమిల కనీసం డ్రైపోర్టునైనా తెలంగాణలోని మహబూబాబాద్ జిల్లాకుతీసుకువచ్చేలా ప్రజాప్రతినిదులు చొరవ చూపాలని నిరుద్యోగులు కోరుతున్నారు.



బిషప్ కోడిరెక్క పద్మారావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్


‘సీఎస్ఐ సేవలు అభినందనీయం’

డోర్నకల్, జూన్20 : డోర్నకల్ అధ్యక్ష మండలంలో సీఎస్ఐ ద్వారా చేపట్టిన సేవలు పేదవర్గాలైన దళితులు, గిరిజనుకు ఎంతోమేలు జరుగుతుందని డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. గురువారం డోర్నకల్‌లోని సీఎస్ఐ చర్చిలో డోర్నకల్ బిషప్ రెవ. కోడిరెక్క పద్మారావు 3వ పట్టాభిషేకం వార్షికోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. సీఎస్ఐ పరిధిలో చేపట్టే కార్యక్రమాలకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. మునిసిపల్ చైర్మన్ వాంకుడోతు వీరన్న, వైస్ చైర్మన్ కోటిలింగం, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుమీర్‌చంద్‌జైన్, కౌన్సిలర్లు అశోక్, కాంగ్రెస్ నాయకులు మాద శ్రీనివాస్, సుశీల్‌కుమార్‌జైన్, కరీంనగర్ సీఎస్ఐ చర్చి బిషప్ రూబెన్‌మార్క్ పాల్గొన్నారు.

బ్యాగులు, నోట్ పుస్తకాల పంపిణీ

కురవి : అనేక సామాజికసేవ కార్యక్రమాలు చేపడుతున్న డెస్టిని ఫౌండేషన్ సేవలు గొప్పవని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. రాజోలు బాలుతండాలో డెస్టిని ఫౌండేషన్ ఆధ్వర్యంలో 300 మంది విద్యార్థులకు ఉచితంగా బ్యాగులు, నోట్‌పుస్తకాలు, పెన్నులు, ఇతరత్రా సామగ్రిని అందించారు. కార్యక్రమంలో డెస్టిని ఫౌండేషన్ బాధ్యులు మాలోతు కిషన్‌లాల్ రాజ్‌పుత్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు అంబటి వీరభద్రం, బండి శ్రీనివాస్, గొల్లపల్లి రజినీకాంత్, మారగాని వీరభద్రం, మాలోతు వీరన్న, మంగీలాల్, బందెల సంజీవరెడ్డి, అంబటి గోవర్ధన్ పాల్గొన్నారు.

ఏఐకేఎంఎస్ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



కొత్తగూడవాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

కొత్తగూడ, జూన్ 20 : మహబూబాబాద్‌లో నిర్వహించనున్న అఖిల భారత రైతుకూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా జనరల్ కౌన్సిల్ వాల్‌పోస్టర్‌ను కొత్తగూడలో గురువారం ఏఐకేఎంఎస్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు భూర్క వెంకటయ్య మాట్లాడుతూ నిత్యం రైతాంగం ఎదుర్కోంటున్న సమస్యలపై పోరాటాలు చేస్తున్న అఖిల భారత రైతుకూలీ సంఘం (ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో మహబూబాబాద్‌లో ఈనెల 26న జిల్లా జనరల్ కౌన్సిల్‌ను నిర్వహిస్తుందన్నారు. ఏఐకేఎంఎస్ మండల ప్రధాన కార్యదర్శి యాదగిరి యుగేందర్, నాయకులు గట్టి సురేందర్, ఈసం జగ్గారావు, తాళ్లపెల్లి ప్రభాకర్, లక్ష్మి, వెంకన్న, సమ్మయ్య పాల్గొన్నారు.

కార్మిక హక్కుల పరిరక్షణకు పోరాడుదాం

బయ్యారం, జూన్ 20 : కార్మిక హక్కుల పరిరక్షణకు పోరాడుదామని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ (ప్రజాపంథా) జిల్లా కార్యదర్శి పాయం చంద్రన్న పిలుపునిచ్చారు. బయ్యారంలో గురువారం భారత కార్మిక సంఘాల సమైక్య (ఇఫ్టు) బయ్యారం ఏరియా రెండోవ మహాసభ జరిగింది. ఈ సభలో ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్మిక వర్గాన్ని బలహీనపర్చడం కోసం కార్పొరేట్ శక్తులకు జపం చేస్తున్నాడని విమర్శించారు. నాయకులు రవి, సూర్యం, సత్యం, నాగరాజు, లచ్చయ్య, సాంబయ్య, వెంకన్న, శ్రీను, కృష్ణ, నాగేశ్వరరావు, రమేష్ పాల్గొన్నారు.

ప్రత్యక్ష పద్ధతిలో కౌన్సెలింగ్ నిర్వహించాలి

నెల్లికుదురు, జూన్ 20 : ప్రత్యక్ష పద్ధతిలో ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు, కౌన్సిలింగ్ నిర్వహించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ కవిత తెలిపారు. ఆలేరు జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గురువారం ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన ఉపాధ్యాయుల కౌన్సిలింగ్ ఇబ్బందికరంగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సంఘ శ్రీనివాస్ ఉపాధ్యాయులు భిక్షపతి, జయప్రకాష్, అనిత స్రవంతి, హరీష్, ఇమామ్,ఉదయ్ కిరణ్, ప్రవీణ్ కుమార్, నర్సయ్య పాల్గొన్నారు.

అసెంబ్లీలో తీర్మానం చేయాలి : ఇఫ్టూ

మహబూబాబాద్ రూరల్, జూన్ 20 : నాలుగు కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను అమలు చేయబోమని అసెంబ్లీలో తీర్మాణం చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఇఫ్టూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పర్వతకోటేష్, హలావత్ లింగన్నలు డిమాండ్‌చేశారు. మహబూబాబాద్ కలెక్టర్ కార్యాలయం ఎదుట శుక్రవారం కొద్దిసేపు ఆందోళన చేపట్టారు. సందర్భంగా వారు మాట్లాడారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు రూ.27 వేల వేతనం చెల్లించాలన్నారు. సింగరేణి బొగ్గు గనుల్లో పనిచేస్తున్న, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలన్నారు. జబ్బార్, లక్ష్మయ్య, కృష్ణ, యాకాంబ్రం, వేణు, రాము, సైదులు, మల్లేషం పాల్గొన్నారు.

మహిళలు ఉన్నతస్థాయికి ఎదగాలి

- కాంగ్రెస్ అర్బన్ అధ్యక్షుడు అంజయ్య



మహిళకు సర్టిఫికెట్లను అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ అర్బన్ అధ్యక్షుడు అంజయ్య

మహబూబాబాద్ టౌన్, జూన్ 20 : మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తూ ఉన్నత స్థానాలకు ఎదగాలని కాంగ్రెస్ పార్టీ అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య అన్నారు. మహబూబాబాద్ దైవకృప వెల్ఫేర్ సొసైటీలో మగ్గం, టైలరింగ్, పేయింటింగ్, జ్యూట్ ,లెదర్ బ్యాగుల తయారీలో శిక్షణ పూర్తయిన మహిళలకు గురువారం సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన అంజయ్య మహిళలకు స్వయం ఉపాధి కోసం కుట్టు మిషన్ శిక్షణ ఇచ్చిన దైవకృప వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులను అభినందించారు. డీసీపీవో వీరన్న, వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు బానోత్ లోకేష్, పార్వతి, శ్యామల, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

విధుల్లో చేరిన ఉపాధ్యాయులు

చిన్నగూడూరు, జూన్ 20 : ఉపాధ్యాయ ఉద్యోగుల పదోన్నతిలో భాగంగా ఎస్‌జీటీల నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందిన జక్కి నాగేశ్వరరావు, వెంకటరామనర్సయ్య, విమలాదేవి, వెంకయ్య, సమీమ్ సుల్తానా, అబ్దుల్, ప్రసాద్‌లు (ఏడుగురు) ఉపాధ్యాయులు గురువారం మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠాశాలలో హెచ్ఎం రవికుమార్‌కు రిపోర్టు చేసి విధుల్లో చేరారు.

‘రైతుల అభివృద్ధికి తోడ్పాటునందించాలి’

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూన్20 : వ్యవసాయ కోర్సు పూర్తి చేసిన డీలర్లు రైతులకు తోడుగా ఉండి వారికి నూతన వ్యవసాయ పద్ధతుల్లో సహకారం అందించి అబివృద్ధికి తోడ్పాటునందించాలని జిల్లా వ్యవసాయాధికారి అభిమన్యుడు, జిల్లా ఉద్యానవన, పట్టుపరిశ్రమ అధికారి జినుగు మరియన్న, మల్యాల కోఆర్డినేటర్ మాలతి అన్నారు. మహబూబాబాద్‌లోని రైతు వేదికలో గురువారం డిప్లమా ఇన్ అగ్రికల్చర్ ఎక్సలెన్స్ సర్వీసెస్ ఫర్ ఇన్‌పుట్ డీలర్ల (దేశీ) ఏడాది కోర్సును పూర్తిచేసిన డీలర్లకు సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ డీలరు రెండు గ్రామాలను దత్తత తీసుకొని నూతన ఆధునిక పద్ధతులను తెలియజేయాలని, వ్యవసాయంలో మార్పులు తేవాలన్నారు. ఏడీఏ లక్ష్మీనారాయణ, కేవీకే శాస్త్రవేత్తలు ఈ.రాంబాబు, క్రాంతికుమార్, కిషోర్‌కుమార్, దేశీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎం.నరేందర్‌గౌడ్, వ్యవసాయాధికారి ఎన్.తిరుపతిరెడ్డి, ఏఈవోలు సాయిచరణ్, లావణ్య పాల్గొన్నారు.



బీరిశెట్టిగూడెంలో స్వాధీనం చేసుకుంటున్న గడ్డినివారణ మందు

గడ్డి నివారణ మందు గ్లైఫోసెట్ స్వాధీనం

దంతాలపల్లి, జూన్20 : మండలంలోని బీరిశెట్టిగూడెం శ్రీఆగ్రోస్ రైతు సేవ కేంద్రంలో గురువారం పోలీసులు, వ్యవసాయాధికారుల ఆధ్వర్యంలో నిషేధిత గడ్డినివారణ మందు (గ్లైఫోసెట్)స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏవో మంజుఖాన్ మాట్లాడుతూ ప్రభుత్వం గత ఐదేళ్ల క్రితమే గ్లైఫోసెట్ గడ్డి మందును నిషేధించిందన్నారు. చట్ట వ్యతిరేకంగా శ్రీఆగ్రోస్ రైతుసేవ కేంద్రంలో యజమాని 26 లీటర్ల (బాటిల్స్) గ్లైఫోసెట్ గడ్డిమందు విక్రయానికి సిద్ధంగా ఉంచాడన్నారు. పక్క సమాచారంతో షాపు తనిఖీలు చేయడంతో 26లీటర్ల గ్లైఫోసెట్ లభించిందన్నారు. జిల్లా అధికారులకు నివేదికతో పాటు గడ్డిమందు నివారణ బాటిళ్లను పంపించి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కరుణాకర్, ఏఈవోలు శిరీష, దీక్షిత్ పాల్గొన్నారు.

ఎరువుల షాపులను తనిఖీ చేసిన జిల్లా వ్యవసాయ అధికారి

నెల్లికుదురు, జూన్ 20 : మండల కేంద్రంతోపాటు మేచరాజుపల్లి గ్రామాలలో ఎరువుల షాపులను గురువారం జిల్లా వ్యవసాయ అధికారి కె.అభిమన్యుడు తనిఖీ చేశారు. యూరియా, డీఏపీ నిల్వలను, ఈ పాస్ నిల్వలు, గోదాము నిల్వలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లు ఎమ్మార్పీ ధరలకు విక్రయించాలన్నారు. ఎక్కువ ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో నెలకుర్తి రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఉన్న భవనాలు ఖాళీ చేయాలి

- మునిసిపల్ కమిషనర్ రవీందర్

మహబూబాబాద్ టౌన్, జూన్ 20 : వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని మహబూబాబాద్ మునిసిపల్ పరిధిలోని పట్టణంతో పాటు విలీన గ్రామాల్లో శిథిలావస్థలో ఉన్న భవనాలు, ఇళ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని కమిషనర్ నోముల రవీందర్ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. కురుస్తున్న వర్షాలతో శిథిలావస్థకు చేరుకున్న భవనాలు కూలే ప్రమాదముందన్నారు. ముందస్తు చర్యలు భాగంగా వాటిని ఖాళీచేసి, సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.

నెక్కొండ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా నరేష్‌రెడ్డి



గూడూరు, జూన్20 : మండలంలోని సీతానాగారం గ్రామానికి చెందిన ఎడ్ల నరేష్‌రెడ్డి వరంగల్ జిల్లా నెక్కొండ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా గుండెంగ గ్రామానికి చెందిన కందిక సుమలత, బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన సమ్మెట శ్రీనివాసులు ఎన్నిక య్యారు. గురువారం వారు సదరు మార్కెట్‌లో పదవీ బాధ్యలు స్వీకరించారు. ఈ సందర్భంగా గూడూరు మండల కాంగ్రెస్, శ్రేణులు, నాయకులు వారిని శాలువాలతో ఘనంగా సత్కరించారు.